
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక





వంటవారు కావలెను

ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న టిఫెన్ మరియు మినిమీల్స్ హోటల్ నందు పని చేసేందుకు అనుభవం కలిగిన వంట వారు కావలెను. కుటుంబంతో వచ్చి పని చేయవలెను. వసతి, భోజనం ఉచితం.

Contact : 9966665060



సంపుటి : 1 సంచిక : 257 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 29 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 257 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 29 july 2024 PAGES : 8 PRICE : 5/-


# మళ్లీ మొదలైన ఎర్రమట్టి దందా



ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపై గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తాం.. ఉత్తరాంధ్రలో ప్రకృతి విధ్వంసం, దోపిడీ ఆగాలి..' ఇది 2023 ఆగస్టు 16న వైసీపీ టార్గెట్‌గా పవన్ కల్యాణ్ చేసిన విమర్శలు..! నాడు జగన్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇప్పుడు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీలు ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. అయినా సీన్ ఏ మాత్రం మారలేదంటున్నారు పర్యావరణ ప్రేమికులు. నాడు జరిగిన విధ్వంసమే కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతుందని ఆరోపిస్తున్నారు.



## ఇది ఎన్డీయే ప్రభుత్వం... డీఎన్‌ఏ ప్రభుత్వం కాదు

- విజయసాయిరెడ్డికి హోంమంత్రి అనిత కౌంటర్
- అనిత, విజయసాయి మధ్య మాటల యుద్ధం
- హత్యలు జరగకుండా చూడడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్న విజయసాయి
- హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- 'శాంతి'-భద్రతల విషయంలో ఎవరు రాజీనామా చేయాలో కాలమే నిర్ణయిస్తుందన్న అనిత

విజయవాడ

ఏపీ హోంమంత్రి అనిత, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. హోంమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడప కూడా దాటడంలేదని విజయసాయి విమర్శించారు. 'బొల్లి' మాటలతో - మిగతా3లో



## చెత్త అర్బన్ ప్లానింగ్‌కు ప్రజలు భారీ మూల్యం చెల్లిస్తున్నారు

- పేలవమైన టౌన్ ప్లానింగ్, ఇన్‌స్టిట్యూట్ల బాధ్యతారాహిత్యానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు
- ఢిల్లీలోని ఓ భవనంలోని బేస్‌మెంట్‌లో నీరు చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మృతి చెందడం చాలా దురదృష్టకరం
- బేస్‌మెంట్‌లో కోచింగ్ సెంటర్ ఎలా నడుస్తోంది? వారికి లైసెన్స్ ఉందా?
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

# ఫ్రీ బస్సుకు కసరత్తు

- త్వరలోనే విధివిధానాలను ఖరారు చేయనున్న ఏపీ ప్రభుత్వం
- పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విశాఖపట్నం, విజయవాడలోని సిటీ, మెట్రో బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీని అమలు చేసే యోచనలో సర్కార్
- నేడు సమీక్షించనున్న సీఎం చంద్రబాబు
- ఏపీలోనూ ఫ్రీ బస్సు జర్నీని అమలు చేస్తే.. ప్రతీ నెలా ఏపీఎస్‌ఆర్టీసీపై రూ. 250 కోట్లు భారం పడుతుందని అంచనా



విజయవాడ

ఏపీలో మహిళలకు ఫ్రీ బస్సు జర్నీ ఎప్పటినుంచి.? ఇప్పుడు ఈ అంశంపైనే కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఈ పథకానికి సంబంధించి త్వరలోనే విధివిధానాలను ఖరారు చేయనుందట ఏపీ ప్రభుత్వం. ఈ మేరకు పథకం అమలుపై కసరత్తులు మొదలుపెట్టింది ఏపీ సర్కార్. పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విశాఖపట్నం, విజయవాడలోని సిటీ, మెట్రో బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీని అమలు చేసే యోచనలో ఉన్నారట.

ఇదిలా ఉంటే.. సోమవారం సీఎం చంద్రబాబు రవాణా, ఆర్టీసీపై కీలక సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్ష అనంతరం మహిళల ఫ్రీ బస్సు జర్నీపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఇప్పటికే అధ్యయనం చేసిన ప్రభుత్వ అధికారులు.. ఇటీవల దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించినట్లు తెలుస్తోంది. ఏపీలోనూ ఫ్రీ బస్సు జర్నీని అమలు చేస్తే.. ప్రతీ నెలా ఏపీఎస్‌ఆర్టీసీపై రూ. 250 కోట్లు భారం పడుతుందని అంచనా వేశారు. కాగా, ప్రతీ రోజూ సుమారు 30 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటే.. వీరిలో 15 లక్షల మంది వరకు మహిళలు ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించింది.


## గోదావరి నదిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

ప్రకటించిన సీఎం చంద్రబాబు

గోదావరి నదిలో కొనసాగుతున్న వరద ఉధృతి

కోనసీమ జిల్లా గంటిపెదపూడి వద్ద బోటు ప్రమాదం

నదిలో పడిపోయి విజయ్ అనే యువకుడి గల్లంతు



విజయవాడ

కోనసీమ జిల్లాలో జరిగిన బోటు ప్రమాదంలో విజయ్ అనే యువకుడు గోదావరిలో గల్లంత య్యాడు. విజయ్ స్వస్థలం పి.గన్నవరం గ్రామం. గంటిపెదపూడి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండగా, ఈ బోటు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం- మిగతా3లో

## ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం!

ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులు అందరికీ ఇస్తాం

ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

విధివిధానాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది

ఎలాంటి లోటుపాట్లు లేకుండా పథకాన్ని అమలు చేయడమే తమ లక్ష్యం



అమరావతి

తల్లికి వందనం పథకంపై శాసన మండలిలో ఏపీ మంత్రి నారా లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులు అందరికీ ఇస్తామన్నారు లోకేష్. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. విధివిధా నాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంద న్నారు. ఈ పథకంపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. తల్లికి వందనం పథకానికి గైడ్ లైన్స్ ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. పైగా ఈ పథకం ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదివే విద్యార్థులందరికీ వర్తిస్తుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలు ఉంటే - మిగతా3లో



## బడ్జెట్‌లో మధ్యతరగతి, యువతకు పెద్దపీట

- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- విద్య, ఉన్నత విద్య కోసం సబ్సిడీ లేదా వడ్డీలేని రుణాలను పెద్దసంఖ్యలో అందచేస్తాం
- ఇది స్వదేశంలో విద్య, ఉన్నత విద్య అభ్యసించాలని కోరుకునే మధ్యతరగతి కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూర్చుతుంది

# ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తిప్రదాతల పేర్లు

- హర్షణీయమని ఉప ముఖ్యమంత్రి వెల్లడి
- విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామం
- పాఠశాల విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ లాంటివి ఇస్తున్నారు
- ఈ పథకాన్ని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం సముచితం



అమరావతి

భావి తరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారు. ఆ దుస్సంప్రదాయానికి మంగళంపాడి - విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామం. పాఠశాల విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక ద్వారా యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్స్ లాంటివి ఇస్తున్నారు. ఈ పథకాన్ని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం సముచితం. - మిగతా3లో

# మళ్లీ మొదలైన ఎర్రమట్టి దందా



**విశాఖపట్టణం :** భీమిలి ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపై గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తాం.. ఉత్తరాంధ్రలో ప్రకృతి విధ్వంసం, దోపిడీ ఆగాలి..' ఇది 2023 ఆగస్టు 16న వైసీపీ టార్గెట్‌గా పవన్ కల్యాణ్ చేసిన విమర్శలు..! నాడు జగన్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇప్పుడు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పార్టీలు ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. అయినా సీన్ ఏ మాత్రం మారలేదంటున్నారు పర్యావరణ ప్రేమికులు. నాడు జరిగిన విధ్వంసమే కూటమీ ప్రభుత్వంలోనూ కొనసాగుతుందని ఆరోపిస్తున్నారు. ఏపీలో మూడు రోజులుగా ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం రాజకీయ రంగు పులుముకుంది. భీమిలికి సమీపంలో ఉండే ఎర్రమట్టి దిబ్బలు 18 వేల నుంచి 20 వేల సంవత్సరాల క్రితం నాటివి. సాధారణంగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మట్టి దిబ్బలు ఏర్పడతాయి. అయితే ఎర్రమట్టి దిబ్బలు మాత్రం వేల సంవత్సరాల క్రితం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన వాతావరణ మార్పులతో ఏర్పడ్డాయి. ఇలాంటి దిబ్బలు దక్షిణాసియాలో కేవలం మూడు ప్రాంతాల్లోనే ఉండగా.. అందులో భీమిలి ఒకటి. ఇంకోటి తమిళనాడులో ఉండగా.. మరొకటి శ్రీలంకలో ఉంది. అంటే ఇండియాలోనే ఈ తరహా మట్టి దిబ్బలు రెండు చోట్ల ఉన్నట్టు లెక్క. అయితే తమిళనాడులోని టెరీ దిబ్బలతో పోల్చితే భీమిలి ఎర్రమట్టి దిబ్బల సైజ్ చాలా పెద్దది. దాదాపు 12 వందల ఎకరాల్లో ఈ మట్టిదిబ్బలు విస్తరించి ఉన్నాయి.బంగాళాఖాతంలో గడ్డకట్టుకుపోయిన నీరు కారణంగా ఈ ఎర్రమట్టి దిబ్బలు ఏర్పడ్డాయని తెలుసా? అవును?వేల సంవత్సరాల క్రితం గడ్డకట్టుకుపోయిన ఆ నీరు ఎన్నో ఏళ్లకు కరగడం ప్రారంభమైంది. ఇక సాధారణంగా సముద్రం మీదుగా బలమైన గాలులు వీస్తాయని తెలుసు కదా.. అలా వీచిన గాలులకు ఒడ్డున ఉన్న ఇసుక పెద్ద ఎత్తున ఎగిరి ఇసుక మేటలు వేసింది. అవే చివరకు విశాఖ–భీమిలిలో ఎర్రమట్టి దిబ్బలుగా ఏర్పడ్డడానికి కారణమైంది.ఎర్ర మట్టి దిబ్బల విలక్షణమైన లక్షణం దాని ఎరుపు రంగు. ఫెర్రోజినేషన్ అనే ప్రక్రియ కారణంగా ఈ రంగు వచ్చిందని చెబుతుంటారు. హెమిటైట్ అనే ఇనుము అధికంగా ఉండే పదార్థం వదులుగా ఉన్న ఇసుక రేణువులను కప్పుతుంది. ఇది నీరు, సూర్యుడు, గాలికి ఎక్స్‌పోజ్ అవుతుంది. ఆ తర్వాత ఆక్సీకరణం చెంది ఇసుకను అందిస్తుంది. వర్షాలు పడినప్పుడు ఈ ఇసుక దిబ్బల్లోని హెమటైట్‌తో పాటు ఇతర మినరల్స్‌తో నీరు రియాక్ట్ అవుతుంది. ఇది ఐరన్ కలర్ అంటే రెడ్ కలర్‌ను విడుదల చేస్తుంది. ఆ తర్వాత క్రమంగా ఈ ఇసుక ఎరుపు రంగులోకి మారుతుంది.1980, 90 దశకంలో సినిమా షూటింగ్లకు కేరాఫ్‌గా నిలిచిన ఈ ఎర్రమట్టి దిబ్బల అందాలు ఇప్పుడు కనిపించడం లేదు. ఇక ఈ అపురూప సంపదను బ్యూటీ పాయింట్ ఆఫ్ వ్యూగా చూడడం కూడా వాటి గొప్పతన్నాన్ని తక్కువ చేసినట్టే అవుతుంది. ఈ ఎర్రమట్టి దిబ్బలను భౌగోళిక వారసత్వ సంపదగా 2014లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించినా వాటికి ఎలాంటి రక్షణా లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎవరెవరో వస్తుండడం.. అక్కడి మట్టిని, ఇసుకను తవ్వి తీసుకుపోతుండడం చాలా ఏళ్లుగా కనిపిస్తోంది. అందుకే ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో ఎక్కువగా గునపాల దెబ్బల గుర్తులే కనిపిస్తున్నాయి.మరోవైపు ఈ ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం విషయం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ, కూటమి పార్టీల ఈ విషయంలో ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నాయి. ఇదంతా గత వైసీపీ ప్రభుత్వ సమయంలోనే ప్రారంభమైందని టీడీపీ–జనసేన ఆరోపిస్తోంది. అయితే భౌగోళిక వారసత్వ సంపదగా ఉన్న 262 ఎకరాల్ని సంరక్షిస్తూ ఎర్రమట్టి దిబ్బలకు ప్రత్యేక బఫర్‌జోన్ ఏర్పాటుచేసి భూ సమీకరణ పూర్తిచేశామని వైసీపీ కౌంటర్ ఇస్తోంది. ఇక కూటమి ప్రభుత్వం ఆ బఫర్ జోన్‌లోకి చొరబడి మరీ మట్టిని అడ్డగోలుగా తవ్వేస్తోందని జగన్ పార్టీ ఆరోపిస్తోంది.ఏ ప్రభుత్వమైనా పర్యావరణానికి హానీ చేసే విధంగా నడుచుకుంటే దాని ఎఫెక్ట్ కేవలం సంబంధిత ప్రాంతానికి, రాష్ట్రానికే పరిమితం కాదు.. అది యావత్ మానవాళిపై ప్రభావం చూపుతుంది. ఈ ఎర్రమట్టి దిబ్బల విధ్వంస విషయాన్ని కూడా రాజకీయపరం చేస్తుండడం బాధాకరణమని పర్యావరణవేత్తలు అంటున్నారు. అసలు విషయాన్ని పక్కన పెట్టి ఇరు పార్టీల నేతలు వాదించుకోవడాన్ని తప్పుపడుతున్నారు.

# లైన్‌మెన్ రామయ్య సాహసం ప్రశంసనీయం



**అమరావతి:** లైన్‌మెన్ కూర రామయ్య చేసిన సాహసం ఏపీ విద్యుత్ ఉద్యోగులందరికీ ఆదర్శనీయమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్ తీగలపై నడిచివెళ్లి కరెంట్ పునరుద్ధరించడాన్ని మంత్రి కొనియాడారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఇటీవల భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. ఆ వర్షాలకు పలు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంటలు నీట మునిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమయంలో అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి మధ్య నిలిచిపోయిన విద్యుత్‌ను ప్రాణాలకు సైతం తెగించి రామయ్య పునరుద్ధరించిన సంగతి మంత్రి రవికుమార్ దృష్టికి వచ్చింది. దీంతో ఎక్స్(ట్విటర్) వేదికగా మంత్రి ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.."ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని లైన్ మన్ రామయ్య నిరూపించారు. ఆయన చేసిన సాహసం తోటి ఉద్యోగులు అందరికీ ప్రత్యక్ష ఉదాహరణ. వరద ఉధృతిని సైతం లెక్క చేయకుండా తీగలపై నడిచి విద్యుత్ పునరుద్ధరించిన రామయ్యకు అభినందనలు. ఆయన సాహసం ఇతర ఉద్యోగులకు ఆదర్శనీయం. సంక్షోభం నుంచి ఎలా బయటపడాలనే విషయంలో అందరికీ ఆయన స్ఫూర్తిగా నిలిచారు. ప్రజావసరాలను తీర్చడంలో ఎన్డీయే ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని రామయ్య నిరూపించారు. భారీ వర్షాలకు అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి విద్యుత్ నిలిచిపోయింది. అక్కడి ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయారు. ఈ తరుణంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న లైన్ మెన్ రామయ్య వరద ఉధృతిని లెక్క చేయలేదు. విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యంగా తీగలపై నడుచుకుంటూ వాగు దాటి కరెంట్ సేవలు పునరుద్ధరించారు. విధి నిర్వహణలో రామయ్య చూపిన సాహసం, తెగువ ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలి. కష్టపడిన వారికి ఎప్పటికైనా గుర్తింపు వస్తుంది. ఈ ఘటన ఎంతో మంది ఉద్యోగుల్లో చైతన్యం నింపుతుందని ఆశిస్తున్నా" అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశంసించారు.

# మదనపల్లె ఘటనలో కీలక పరిణామం..
# మిగిలింది పెద్దిరెడ్డేనా?





అన్నమయ్య జిల్లా: తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసు దర్యాప్తులో ఏపీ పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే పలు కీలక విషయాలు వెలుగు చూడగా.. ఇప్పుడిప్పుడే సూత్రదారులు ఎవరు..? పాత్రదారులు ఎవరు..? అనేది తేల్చే పనిలో పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాబ్ పాషాను విచారించడానికి పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఆదివారం నాడు సుమారు 10 మందికి పైగా పోలీసులు నవాబ్ పాషా ఇంటికి చేరుకున్నారు. అయితే ఆ సమయంలో ఆయన లేకపోవడంతో ఇంటి వద్దే పోలీసులు మకాం వేశారు. ఆయనకు నోటీసులు ఇచ్చి విచారించాలని ప్రయత్నిస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో.. ఆయన ఎప్పుడు వస్తారా అని పోలీసులు ఎదురుచూస్తున్నారు. అయితే పాషా రాగానే 41 నోటీసులు ఇచ్చి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాలనే యోచనలో ఉన్నారు.

**కొలిక్కి.. వస్తోంది..!!**

మరోవైపు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన తనయుడు ఎంపీ మిథున్‌రెడ్డిలకు చెందిన పీఆర్వోతో పాటు అనుచరులను కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట చలపతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. పెద్దిరెడ్డి మరో ముఖ్య అనుచరుడైన మాధవరెడ్డి పరారీలో ఉండటంతో ఆయన కోసం వెతుకుతున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని.. వారి నుంచి మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. ఒకవైపు పోలీసులు.. మరోవైపు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి వీలైనంత త్వరగా కేసును కొలిక్కి తేవడానికి ప్రయత్నిస్తున్నారు.

**కీలక పత్రాలు స్వాధీనం..!!**

ఇదిలా ఉంటే.. పెద్దిరెడ్డి పీఏ శశికాంత్ ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలో ఉంటున్న శశికాంత్ ఇంటికి ఈరోజు ఉదయమే చేరుకున్న 10 మంది ఆంధ్రప్రదేశ్ పోలీసులు 8 గంటల పాటు సోదాలు చేశారు. ఈ సోదాల్లో కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫైళ్లను భద్రంగా 4 బాక్స్‌ల్లో ఏపీకి తీసుకెళ్లారు. అయితే పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న పెద్దిరెడ్డి పీఏ ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. ఫ్లాట్ ఓనర్, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ని పిలిపించిన పోలీసులు శశికాంత్ ఇంట్లో అణువణువు సోదాలు చేశారు. శశిని విచారించిన తర్వాత ఇక మిగిలింది పెద్దిరెడ్డి ఒక్కడేనని.. ఆయన ఇంట్లో సోదాలు చేసి విచారణ కూడా చేస్తారని పుంగనూరులో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.

## ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తిప్రదాతల పేర్లు

-మొదటిపేజీ తరువాయి



ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి, ఆంధ్రా విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా, భారత తొలి ఉపరాష్ట్రపతిగా, 2వ రాష్ట్రపతిగా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం రేపటి పౌరులకు మార్గ నిర్దేశనం చేస్తుంది. మధ్యాహ్న భోజన పథకానికి సైతం గత ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకున్నారు. ఇందుకు భిన్నంగా– 'అపర అన్నపూర్ణ' డొక్కా సీతమ్మ పేరును ఈ పథకానికి పెట్టడాన్ని ప్రతి ఒక్కరం స్వాగతించాలి. ఏ వేళలో అయినా కడుపు నిండా అన్నంపెట్టి ఆకలి తీర్చిన దానశీలి డొక్కా సీతమ్మ. వారి దయాగుణం, సేవాభావం విద్యార్థులకు తెలియచేయడం ద్వారా ఆ సద్గుణాలు అలవడుతాయి. మన దేశపు మిస్సైల్ మ్యాన్ డా.అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం ద్వారా యువతలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. పేద కుటుంబంలో పుట్టిన కలాం ఎన్నో ఆటుపోట్ల నడుమ విద్యాభ్యాసం సాగించి శాస్త్రవేత్తగా ఎన్నో విజయాలు అందుకొన్నారు. తదనంతరం రాష్ట్రపతిగా బాధ్యతలను ఆదర్శవంతంగా నిర్వర్తించారు. కలాం జీవన ప్రస్థానం నవతరంలో స్ఫూర్తిని కలిగిస్తుంది. మహనీయుల పేర్లతో పథకాలు అమలు చేయడం ద్వారా వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకొంటారు. ఆ మహనీయుల దివ్యాశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు.

## ఇది ఎన్డీయే ప్రభుత్వం... డీఎన్ఏ ప్రభుత్వం కాదు

-మొదటిపేజీ తరువాయి

కాలక్షేపం చేయడం వల్లనే రాష్ట్ర భయం గుప్పిట్లోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. హత్యలు జరగకుండా చూడడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, అందుకు హోం మంత్రే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నైతిక బాధ్యత వహించి హోంమంత్రి రాజీనామా చేయాలని విజయసాయి డిమాండ్ చేశారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందించారు. 'శాంతి'–భద్రతల విషయాల్లో మీరు రాజీనామా చేయాలో, నేను రాజీనామా చేయాలో కాలమే త్వరలో నిర్ణయిస్తుందని కౌంటర్ ఇచ్చారు. అయినా ఇది డీఎన్ఏ ప్రభుత్వం కాదు... ఇది ఎన్డీయే ప్రభుత్వం... ప్రజలు బాగానే ఉన్నారు... దొంగలే కోటల్లో దాక్కుని ప్రెస్ మీట్లు, ఎక్స్ లో రెట్టలు వేస్తున్నారు అని అనిత విమర్శించారు.

## పులివర్తి నానిపై హత్యాయత్నం కేసు..
## వైసీపీ నేత మోహిత్‌రెడ్డిని విడిచిపెట్టిన పోలీసులు

**చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో 37వ నిందితుడిగా మోహిత్‌రెడ్డి**

**నిన్న బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**విచారణ అనంతరం 41ఏ నోటీసులు ఇచ్చి విడుదల**

టీడీపీ నేత, ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని పోలీసులు విడిచిపెట్టారు. దుబాయ్ వెళ్లేందుకు బెంగళూరు చేరుకున్న మోహిత్‌రెడ్డిని గత రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి ఈ ఉదయం తిరుపతిలోని ఎస్వీయూ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడ ఆయనను విచారించిన అనంతరం 41ఏ నోటీసులు ఇచ్చి వదిలిపెట్టారు. విదేశాలకు వెళ్లకూడదని షరతులు విధించారు. ఏపీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రగిరి నుంచి పులివర్తి నాని పోటీ చేయగా, ప్రత్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బరిలోకి దిగారు. పోలింగ్ అనంతరం తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూం పరిశీలనకు వెళుతున్న క్రమంలో పులివర్తి నానిపై దాడి జరిగింది. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో మోహిత్‌రెడ్డి 37వ నిందితుడిగా ఉన్నారు.

## గోదావరి నదిలో గల్లంతైన
## యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

-మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. గోదావరిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం ప్రకటించారు. గోదావరి నదిలో వరద ఉధృతి తగ్గేంతవరకు లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## ఏ విషయంలో దేశం
## అభివృద్ధి చెందిందో చెప్పాలి: కె రామకృష్ణ




విజయవాడ: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీపై కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లిన సీఎం చంద్రబాబు ప్రధాని మోదీని పొగడడానికే పరిమితమయ్యారని, ప్రధాని మోదీ పదేళ్ల కృషి వలన దేశం ప్రగతి సాధించింది అని చెబుతున్నారని.. ఏ విషయంలో దేశం అభివృద్ధి చెందిందో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య అలానే ఉందని, బ్లాక్ మనీ వెలికి తీస్తామన్నారు.. అదీ చేయలేకపోయారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, సీఎం చంద్రబాబు చెప్పేదానికి, జగన్ చెప్పేదానికి ఏమాత్రం పొంతన లేదని రామకృష్ణ అన్నారు. రాష్ట్ర అప్పులపై స్పష్టత లేని ప్రకటనలు చేస్తున్నారని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఇచ్చిన దానిలో కూడా స్పష్టత లేదని, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత ఇచ్చారు కానీ స్పష్టత లేని కేటాయింపులు చేశారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మీడియా సమావేశం పెట్టి వివరించాలని డిమాండ్ చేశారు. మదనపల్లెలో భూములు కబ్జా, పత్రాల దగ్ధం చేశారని, కడప జిల్లాలో కూడా లక్ష ఎకరాలపై చిలుకు భూములు కబ్జాకు గురయ్యాయని, దానిపై కూడా విచారణ జరిపించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కబ్జాలకు గురైన భూములపై విచారణ జరిపించాలన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ దగ్గర ఉన్న భూముల సమాచారం అందజేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములపై విచారణ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. కాగా నాలుగు రోజుల క్రితం కర్నూలు జిల్లా, సీఆర్ భవన్‌లో మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర విభజన తరువాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలు లేవన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలు, అప్పులపైనే గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, పూర్తిస్థాయి బడ్జెట్ ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, పోలవరం నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని అన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఏపీని ఆదుకుని ఆర్థికంగా గాడిలో పెట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ముచ్చుమర్రిలో బాలికపై అఘాయిత్యం చేసి హత్య చేయడం దారుణమన్నారు. నేటికి బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించలేకపోవడం బాధాకరమని అన్నారు.

## ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం.!

-మొదటిపేజీ తరువాయి

అంతమందికీ ఇస్తామని ఎన్నికల ప్రచారంలోనే చెప్పామని, ఆ మాటకు కూడా కట్టుబడి ఉన్నామన్నారు. నిబంధనలు రూపొందించేందుకు కాస్త సమయం కావాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పథకాన్ని అమలు చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ అంశంపై మంత్రులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఒక్కొక్కరికి 15 వేలు ఇస్తామని చెప్పి.. ఆ తర్వాత 14 వేలు, అనంతరం 13 వేలకు ఆ మొత్తం తగ్గిందని లోకేష్ అన్నారు. అర్హత నిబంధనలను కూడా గత ప్రభుత్వం మార్చిందన్నారు. ఈ పథకంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నామన్నారు.

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కాలినడకన తిరుమలకు ఎమ్మెల్యే ఉగ్ర దంపతులు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 28)

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ని దర్శించుకునేందుకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆయన సతీమణి డాక్టర్ కవితలు ఆదవారం సాయంత్రం తిరుపతి నుండి తిరుమలకు కాలి నడకన బయలుదేరి వెళ్ళారు. కుటుంబ సభ్యులతో పాటు వారు కాలినడకన తిరుమలకు వెళ్ళారు. శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కనిగిరి ప్రాంతంలో రైతన్నలు పాడి పంటలతో విరజిల్లాలని, కనిగిరి అన్ని రకాలుగా అభివృద్ధి చెందేందుకు ఆ వెంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుకోనున్నట్లు డాక్టర్ ఉగ్ర వెలుగు ప్రతినిధికి తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా 5 ప్రధాన సమస్యలయిన ఇంటింటికి కుళాయి, నిమ్జ్, రైల్వే లైను, ట్రిపుల్ ఐటి, వెలిగొండ ప్రాజెక్టును సాధించేందుకు శ్రీ వేంకటేశ్వరస్వామి తనకు ఆ శక్తి ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కనిగిరిని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర దంపతులతో పాటు ఆయన అనుచరులు కొందరు తిరుమలకు కాలినడకన వెళ్ళారు.



# అలా వదిలేశారు

## ఆక్రమణలని తేల్చినా చర్యలకు వెనకడుగు

## మార్కాపురంలో రూ.కోట్ల భూములు అన్యాక్రాంతమైనట్లు గుర్తింపు

## అన్నిచోట్లా వైసీపీ నేతలే పాగా

## కఠిన చర్యలు చేపట్టని అధికారులు

## రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు

## ఆక్రమణలు ఎమ్మెల్యే, కలెక్టర్ అడ్డుకట్ట వేసేనా...!

(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జులై 28)

పాలకుల అండదండలు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదుల ద్వారా ఆక్రమణలు వెలుగుచూస్తున్నా అధికార యంత్రాంగం మొదట్లో హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోతోంది. అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆక్రమణదారులకు అలుసుగా మారుతోంది. కొద్దిరోజుల తర్వాత మళ్లీ కబ్జాలకు తెరతీస్తున్నారు. ఆక్రమణదారులు విసిరే చిల్లర పైసలకు ఆశపడేవారు కొందరైతే, పాలకులకు భయపడి చూసీ చూడనట్లు పని చేసుకుపోయే వాళ్లు మరికొందరు ఉన్నారు. దీంతో రూ.వందల కోట్ల ప్రభుత్వ ఆస్తులు పరుల పరమవు తున్నాయి. ఈ పరంపరకు శాశ్వత ముగింపు పలకాల్సిన యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయకపోవడం ప్రభుత్వ ఆస్తులకు శాపంగా మారింది. ఆక్రమణలు వెలుగుచూసిన తర్వాత హెచ్చరిక బోర్డులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం లాంటి సున్నిత చర్యలకే పరిమితం కావడంతో వారు రెచ్చిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి కఠినంగా వ్యవహరించేందుకు స్థానిక అధికారులకు ఆదేశాలిస్తేనే ఈ తతంగాలకు ముగింపు పలికే అవకాశం ఉంది.

**పోరాడుతున్నా ఆగని ఆక్రమణ....** మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలోని 856 సర్వే నెంబర్‌లో 3.01 ఎకరాల ఆర్అండ్‌బీ స్థలం ఉంది. అందులో జాతీయ రహదారి 565కి 2.50 ఎకరాలు పోను ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లోకి 0.50 ఎకరాల మేర విలువైన స్థలం ఉంది. దీనిపై కన్నేసిన వైసీపీకి చెందిన ఓ మండలస్థాయి మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకునేందుకు పదేళ్లుగా ప్రయత్నిస్తున్నాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. సుమారు రూ.5 కోట్ల విలువైన ఆ స్థలంలో ఆరు నెలల క్రితమే ఓ నిర్మాణాన్ని కూడా ప్రారంభించాడు. గ్రామస్థులు ఎన్నిసార్లు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పరిశీలించి (తరువాయి 4లో...)

# మద్దిపాడులో విలేకరులపై దాడికి యత్నం

## వీఆర్ఏని సమాచారం అడుగుతుండగా దాడికి యత్నించిన ఆక్రమణదారుడు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

విలేకరులపై ఓ వ్యక్తి అసభ్య పదజాలంతో దాడికి యత్నించాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్ల వరంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మల్లవరం, తెల్లబాడు, దొడ్డవరం గ్రామాలకు నీరు సరఫరా చేసే ఊట బావిలోకి నీరు రాకుండా మల్లవరం వద్ద వాగులో తవ్వకాలు జరుపుతూ వెంకటేశ్వర స్వామి కొండ పోరంబోకు, వాగు పోరంబోకు ఆక్రమణ చేసుకొని అక్రమ కట్టడాలు కడుతున్నారంటూ దొడ్డవరం, తెల్లబాడు గ్రామస్తులు విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో విలేకరులు మల్లవరం వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లగా అక్కడ అక్రమ కట్టడాలు కడుతున్న సమీపంలో ఉన్న వీఆర్ఏను వివరాలు అడిగేందుకు వెళ్లగా సదరు టిడిపి సానుభూతిపరుడు, లింగంగుంట గ్రామానికి చెందిన అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తి ఎవర్రా విలేకరులు అంటూ పైకి వచ్చి దాడికి యత్నించాడు. అదేమని ప్రశ్నించగా అసభ్య పదజాలంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. పక్కనే వీఆర్ఏ, స్థానికంగా పనిచేసే కూలీలు చూస్తునే ఉన్నారు. ఈ స్థలం అతని దేనంటూ వారు మాట్లాడడం విస్మయాన్ని కలిగించింది. కోట్ల రూపాయల ఆస్తులు ఉన్న వ్యక్తికి వెంకటేశ్వరస్వామి కొండ పోరంబోకులో మూడు సెంట్లు ప్రభుత్వ డీకే పట్టా ఎవరు ఇచ్చారు. వాగు పోరంబోకు, కొండ పోరంబోకు రెండిట్లో (తరువాయి 4లో...)

# చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

## పొన్నలూరు సర్పంచ్ సహా పలువురు టీడీపీలో చేరిక



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 28)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల శ్రీ వీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం నాడు తూర్పునాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పొన్నలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలపర్తి శాంతితో పాటు 9 వార్డు మెంబరు లింగంగుంట నరసింగరావు, పాలపర్తి పెద అంజయ్య తదితరులు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... వైసిపి ఐదేళ్ల పాలనలో (తరువాయి 4లో...)

# రామయ్య సాహసమే ఉద్యోగులకు స్ఫూర్తి



## లైన్ మెన్ రామయ్యను అభినందించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్

## వరద ఉద్ధృతిని లెక్క చేయకుండా తీగలపై నడిచి విద్యుత్ పునరుద్ధరించిన రామయ్య

## రామయ్య సాహసం ఇతర ఉద్యోగులకు ఆదర్శనీయమని మంత్రి కితాబు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

సంక్షోభం నుంచి అవకాశాలు అందిపుచ్చుకోవడం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నుంచి నేర్చుకున్నామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. ఇందుకు లైన్ మెన్ రామయ్య చేసిన సాహసమే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన కొనియాడారు. ప్రజావసరాలను తీర్చడంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మరోసారి నిరూపించామని చెప్పారు. భారీ వర్షాలకు అల్లూరి జిల్లా సున్నంపాడు, దేవరపల్లికి విద్యుత్ నిలిచిపోయింది. అక్కడి

(తరువాయి 4లో...)



# ముద్దాయి అరెస్ట్ ఎస్పీ అభినందనలు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 28)

వ్యభిచారం కేసులో పారిపోయిన ముద్దాయిని అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా ఇన్‌ఛార్జి సిఐ షేక్ ఖాజావలి తెలిపారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కొత్తపట్నం మండలం, రాజుపాలెం గ్రామానికి చెందిన మార్టూరి ప్రతాప్‌రెడ్డి ఈ నెల 20న పోలీసులు ఒంగోలు పాత గుంటూరు రోడ్, గుప్తాస్ మిడ్ టౌన్ నాలుగవ ఫ్లోర్ లో ఉన్న సార స్పా సెంటర్ నందు ఆ స్పా సెంటర్ నిర్వాహకుడు అయిన కిమిడి పవన్ కుమార్‌కు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి బయట నుండి పిలిపించిన అమ్మాయిలతో వ్యభిచారం చేయటానికి ఉండగా జరిపిన పోలీస్ రైడ్‌లో పోలీస్ కస్టడిలో నుండి పోలీసులను నెట్టి వేసి అక్కడినుండి పారిపోయినందున ముద్దాయిగా ఉన్నాడు. ఈ సంఘటన పై మార్టూరి ప్రతాప్ రెడ్డి పై కేసు నమోదు చేయబడినది. ఈ సంఘటన పై ప్రకాశం జిల్లా ఎస్పి ఏ ఆర్ దామోదర్ పారిపోయిన మార్టూరి ప్రతాప్‌రెడ్డి ని పట్టుకోవటానికి స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ సమాచారం మేరకు ముద్దాయిని ఆదివారం మధ్యహ్నం 2 గంటలకు ఒంగోలు తాలుక ఇంచార్జ్ సిఐ షేక్ ఖాజావలి అరెస్ట్ చేయటం జరిగింది. ఈ కేసును ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డిఎస్పీ ఎం కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఒంగోలు తాలుక ఇంచార్జ్ సిఐ షేక్ ఖాజావలి, ఒంగోలు తాలుక ఎస్ఐ ఎం విజయ్ కుమార్, క్రైం పార్టీ కె రామకృష్ణ, ఆర్ రాంబాబు, కె రవికుమార్‌లను ముద్దాయిని పట్టుకున్నందుకు ప్రకాశం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మద్దిపాడులో విలేకరులపై దాడికి యత్నం




చెందిన సర్పంచ్‌ను సైతం అసభ్య పదజాలంతో దూషించాడని ఆ గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి తెలిపారు. విలేకరులు తిరిగి వెళుతుండగా మళ్లీ అసభ్య పదజాలంతో దూషిస్తూ, వీడియో తీసే విలేకరులను కులం పేరు ఎత్తి బూతులు తిట్టాడని గ్రామస్థులు తెలిపారు. అదే విధంగా ఆ గ్రామానికి చెందిన పలువురి పై కూడా ఆ వ్యక్తి అలానే మాట్లాడాడని తామే తలదించుకొని వచ్చేవారమని వారు తమ ఆవేదనను మీడియా ప్రతినిధులకు తెలిపారు. వాగు పోరంబోకు ఆక్రమించడానికి డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, గ్రామ సర్వే సర్వేయర్ సదరు ఆక్రమణదారుడు దగ్గర డబ్బులు తీసుకొని వాగు పోరంబోకులోకి కూడా అతనికి స్థలాన్ని చూపారని మల్లవరం గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ దీని పై ప్రత్యేక దృష్టి సారించి నిజనిజాలు నిగ్గు తేల్చి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అతనికి పట్టాలు ఇచ్చినట్లు గ్రామస్తులకు చూపిస్తూ అడిగిన వారిని భయాందోళనకు గురి చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాగు పోరంబోకును తవ్వుతూ ఇసుక దిబ్బలను ఏర్పాటు చేసుకుని అక్రమ కట్టడాలు కడుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. కొన్నేళ్ల క్రితం కొంత భూమిని కొని వాగు, కొండ పోరంబోకులను ఆక్రమించుకొని కన్వర్షన్ లేకుండానే మూడు నాలుగు అంతస్తుల భవనాల నిర్మాణం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. తనకు మూడు సెంట్లు స్థలం రెవెన్యూ అధికారులు ఇచ్చారంటూ డీకే పట్టా చూపించడం విడ్డూరంగా ఉందన్నారు. విలేకరులు డీకే పట్టా ఎవరికీ ఇచ్చారు. మీకు ఎలా ఇస్తారని ప్రశ్నించగా అతను పత్రికలో రాయలేని భాషలో తిట్లదండకం ఎత్తుకుని బెదిరింపులకు దిగాడు. పైగా ఎమ్మెల్యే తనకు బాగా తెలుసు అని, ఎమ్మెల్యేతో మాట్లాడి మీ అంతు తేలుస్తానని చెప్పడం కొసమెరుపు. అనంతరం అతను గొడవ పడుతూ దాడికి యత్నిస్తూ ఉండడాన్ని వీడియో తీస్తున్న విలేకరి పైకి వచ్చి దాడి చేయడానికి ప్రయత్నించాడు. గతంలో సదరు వ్యక్తి ఆ గ్రామానికి




# దారిద్ర్యాన్ని తొలగించే మహా మంత్రరాజం కనకధారాస్తోత్రం

## ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)** దారిద్ర్యాన్ని తొలగించే మహామంత్రరాజ్యం జగద్గురువులు ఆదిశంకరాచార్యులు రచించిన కనకధారా స్తోత్రం అని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ప్రోబస్ క్లబ్ వేటపాలెం వారి ఆధ్వర్యంలో వేటపాలెంలోని రోటరీ క్లబ్ హాలులో నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ఆయన కనకధారాస్తవం పై ప్రసంగించారు. జగద్గురువులు ఆదిశంకరాచార్య స్వామి బాల శంకరులుగా ఉన్నప్పుడు పేద బ్రాహ్మణ కుటుంబం యొక్క దారిద్ర్యాన్ని తొలగించడానికి లక్ష్మీదేవి గురించి చేసిన స్తోత్రమే కనకధారా స్తోత్రము అని అన్నారు. అన్ని కష్టాల నుంచి మనుషులను గట్టెక్కించే కనకధారా స్తోత్ర మహా మంత్రాన్ని నిత్యం పారాయణ చేసే వారి ఇంట లక్ష్మీదేవి తాండవిస్తుందని అన్నారు. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణమాసం వస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ నిత్యం కనకధారా స్తోత్రాన్ని పఠించి శుభాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రసంగీకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులను ప్రోబస్ క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోబస్ క్లబ్ గౌరవాధ్యక్షులు గొల్లపూడి సీతారాం, అధ్యక్షులు ఆవుల పున్నయ్య, ఉపాధ్యక్షుడు బుద్ధి సుబ్బరామయ్య, ప్రధాన కార్యదర్శి బీరక సుబ్రహ్మణ్యం, కోశాధికారి బొడ్డు కోటేశ్వరరావు, కొసనం నాగమాంబ, కర్లసుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్తలు వడలి రాధాకృష్ణ, పాలూరి శివప్రసాద్, ప్రముఖ సంగీత విద్వాంసులు భాగీ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.




# అలా వదిలేశారు

అక్కడ ఆక్రమణ జరిగినట్లు గుర్తించారు. అక్కడి నిర్మాణం కూడా ఆర్అండ్‌బీ స్థలంలోనే జరిగిందని నిర్ధారించారు. ప్రభుత్వ భూమిలో కట్టిన ఆ నిర్మాణాన్ని తొలగించేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆక్రమణను గుర్తించాం, ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఇక మా పనైపోయింది అన్నట్లు వ్యవహరిస్తున్నారు ఆ రెండు శాఖల అధికారులు. ఆర్అండ్‌బీ అధికారులు ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం ఆక్రమణదారులకు వరంగా మారింది. రూ.కోట్ల విలువైన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులపై ప్రత్యేక దృష్టి పెడితేనే ఆక్రమణలను నిలువరించే అవకాశం ఉంది.

**అప్పగించిన స్థలాన్ని కాజేస్తున్నారు..**

మార్కాపురం పట్టణంలో 565 జాతీయ రహదారిని ఆనుకుని 1011/2 సర్వే నెంబర్‌లో 0.65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో రెండు ప్రభుత్వ శాఖలకు కార్యాలయాలు నిర్మించుకొనేందుకు 10 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారు. మిగిలిన ప్రభుత్వ భూమి పై పక్కన పట్టా భూమి ఉన్న వైసీపీకి చెందిన ఓ మున్సిపల్ కౌన్సిలర్ కన్నేశాడు. రూ.కోట్ల విలువైన ఆ భూమిలో తొలుత దారి కోసమని కొంత చదును చేశాడు. క్రమంగా ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడ బోర్డు పాతి తమ పని అయిపోయింది అన్నట్లుగా చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ కౌన్సిలర్ తన భూమికి దారి మాటున మళ్లీ ఆక్రమణకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రెవెన్యూ అధికారులు రూ.కోట్ల విలువైన ఆ భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుంటే తప్ప భవిష్యత్తులో ఆక్రమణలను నిలువరించడం అసాధ్యమే. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తారో వదిలేస్తారో చూద్దాం మరి..!

# రామయ్య సాహసమే ఉద్యోగులకు స్ఫూర్తి



ప్రజలు బాహ్య ప్రపంచంతో ప్రజాసంబంధాలను కోల్పోయారు. ఈ తరుణంలో ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పని చేస్తున్న లైన్ మెన్ కూర రామయ్య వరద ఉద్ధృతిని కూడా లెక్క చేయకుండా... విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యంగా తీగలపై నడుచుకుంటూ వాగు దాటి విద్యుత్ సేవలను అందించారు. విధి నిర్వహణలో రామయ్య చూపిన సాహసం, తెగువ అభినందనీ యమని మంత్రి కొనియాడారు. ఇది ఎంతో మంది ఉద్యోగులకు ఆదర్శమని, మరెంతో మందిలో చైతన్యం నింపుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు. కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు.

# చంద్రబాబునాయుడు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

రాష్ట్రం 50 ఏళ్ళు వెనక్కి వెళ్లిందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు పెద్ద ఎత్తున ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించారని అన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రానికి మంచి రోజులని నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరుతు న్నారని అన్నారు. ప్రజల ఆకాంక్షల కనుగుణంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మాజీ మండల పార్టీ అధ్యక్షులు మండవ ప్రసాద్, జిల్లా తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి మండవ మురళి, మండవ వెంకటేశ్వర్లు, ఐటిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మండవ వెంకటేష్, బీసీ నాయకులు కంచర్ల బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ గిద్దలూరు శాఖ నూతన కమిటీ ఎన్నిక



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 28)** గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గంజి వీరయ్య, చైర్మన్‌గా గుర్రం నరసింహులు, అధ్యక్షులుగా పాలగుళ్ళ వెంకట శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా కూరాకు మూర్తయ్య, ప్రధాన కార్యదర్శిగా పుట్టా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గాదంశెట్టి శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా దగ్గుపాటి వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా కన్వీనర్‌గా డాక్టర్ మొర్రి పిచ్చయ్య, గౌరవ సలహాదారులుగా గుళ్ళా రామకృష్ణారెడ్డి, వడ్డీ వీరారెడ్డి, పసుపులేటి విజయ కుమార్, డైరెక్టర్లుగా వెంకట రంగయ్య, గొటికే రవీంద్రారెడ్డి, డాక్టర్ మొర్రి పిచ్చయ్య, మోడీ గారి కృష్ణ, రాస బాలుడు, అలిశెట్టి బాల వెంకటేశ్వర్లు, తాడువ వెంకటేశ్వర్లు, సూరే. సుబ్రహ్మణ్యం, సూరే రామచంద్రారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదనంతరం అధ్యక్షులు శివారెడ్డి కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రథం, ఫ్రీజర్, సామాజిక కార్యక్రమాలు చేయదల్చారు. సభ్యత్వ కార్యక్రమం, ఆర్థిక వనరుల సేకరణ చేసి సంస్థ బలోపేశానికి కృషి చేయాలని తీర్మానించారు.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా

- రూరల్ నియోజకవర్గం నానాటికి వాడవాడలా విస్తరిస్తుంది
- నిరంతరం రూరల్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా
- ఎన్నికల వరకే రాజకీయాలు
- ఎన్నికలు అనంతరం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దు
- రూరల్ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హితవు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్, శ్రీహరి నగర్‌లో 10 లక్షల రూపాయల నిధులతో మంచినీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డాక్టర్ జెడ్. శివప్రసాద్, స్థానిక కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతి ప్రియ , 19వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నూకరాజు మదన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో పూర్తిగా గాడి తప్పిన ఆంధ్ర రాష్ట్రాన్ని అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గాడిన పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల్లో ఎవరికి నచ్చిన పార్టీకి వారు ఎన్నికలు చేసుకోవచ్చుని, అనంతరం రాజకీయాలకు అతీతంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని రూరల్ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హితవు పలికారు.





## అలిపిరి మెట్ల మార్గంలో భక్తుడికి పాము కాటు బాధితుడిని ఆసుపత్రికి తరలింపు



(షణ్ముఖ వెలుగు, తిరుమల, జులై 28)

అలిపిరి మెట్ల మార్గంలో ఓ భక్తుడు పాము కాటుకు గురయ్యాడు. చీరాలకు చెందిన 8 మంది భక్తులు నడక మార్గంలో వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఏడో మైలు దాటిన తర్వాత భక్తుడు నాగేంద్ర (29) పాముకాటు బారినట్లు అధికారులు తెలిపారు. వెంటనే స్పందించిన ఫారెస్ట్ అధికారులు అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని డాక్టర్లు పర్యవేక్షణలో ఉంచారు.

## 28వ డివిజన్‌లో క్యాన్సర్‌పై అవగాహన







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

నెల్లూరు రూరల్ 28వ డివిజన్లో నేడు చైతన్యపురి కాలనీలోని పార్కులో క్యాన్సర్ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింహపురి హాస్పిటల్ డాక్టర్ దయాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్క అహల్య, చైతన్యపురి పార్క్ అసోసియేషన్ సెక్రటరీ కొండూరు సుబ్బారావు, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ వరుణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ సూర్యతేజ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ సూర్య తేజ ఆకాంక్షించారు. ఈ నెల 29వ తేదీ సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్ లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాలయంలో కమీషనర్‌ను నేరుగా కలిసి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందుకున్న సమస్యలను వీలున్నంత త్వరగా పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని కృషి చేస్తామని కమీషనర్ తెలిపారు.

# మార్కాపురం జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

- సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు
- దేవండ్ల శ్రీనివాస్ డిమాండ్




(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 28)

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పడి 54 సంవత్సరాలవుతున్నా ఆనాడు ఒంగోలు జిల్లా కేంద్రంగా ప్రకాశం జిల్లా గుంటూరు జిల్లాలోని కొంత భాగం నెల్లూరు జిల్లాలోని కొంత భాగం కర్నూలు జిల్లాలోని కొంత భాగాన్ని కలిపి ఒంగోలు కేంద్రంగా ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేయడం జరిగింది. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఈ ప్రాంతం అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది ఒంగోలు కేంద్రానికి పశ్చిమ ప్రాంతం ముఖ్యంగా యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి ,మార్కాపురం, కనిగిరి, ప్రాంతాల ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఒంగోలుకు వెళ్లాలంటే 100 నుండి 150 కిలోమీటర్లు ప్రయాణించి పనులు చేసుకుని రావాల్సి వస్తుంది. అధికారులు సరే టయానికి లేకపోవడం వల్ల ఒకరోజు అదనంగా ఒంగోలు నుండి పనులు చేసుకొని రావాల్సి ఉంది. కథ 50 సంవత్సరాల నుండి మార్కాపురం జిల్లా కేంద్రంగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని ఎన్నో ఉద్యమాలు జరిగినాయి కానీ జగన్ మోహన్ రెడ్డి కొత్త జిల్లాలు ఏర్పాటు చేసే టైములో మార్కాపురం జిల్లా ఏర్పాటవుతుందని ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూశారు కానీ ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షన్ను ఏమాత్రం పట్టించుకోకుండా పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని జిల్లా కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ప్రజల మనోభావాలను లెక్కచేయకుండా ఒంగోలు కేంద్రంగానే ఉంచటం జరిగింది కానీ ఇటీవల నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు మార్కాపురం వచ్చినప్పుడు ఎన్నికల వాగ్దానములు మార్కాపురం జిల్లాగా ప్రకటించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేస్తానని చెప్పి మొదటి సంతకము మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చేస్తామని చెప్పి వాగ్దానం చేయడం జరిగింది కానీ రెండు నెలలు కావస్తున్న ఈనాటికీ కూడా జిల్లా ప్రకటించకపోవడంవలన ఏర్పాటు చేస్తారో లేదు అని ఈ ప్రాంత ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు ముఖ్యంగా మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటు అయితే పక్కనే దొనకొండలో విమానాశ్రయము గతంలో ఏర్పాటు చేయడం జరిగింది పక్కనే రాయవరంలో రైల్వే స్టేషన్ ఉంది మార్కాపురానికి 80 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం పుణ్యక్షేత్రం ఉంది ప్రధానంగా చారిత్రక కట్టడాలలో ఒకటైన చెన్నకేశవ స్వామి దేవస్థానం ఒకప్పుడు మార్కాపురం పలక అంటేనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగినటువంటి పలకల పరిశ్రమ ఉంది. అన్నిటికీ మించి ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలు నుంచి తాగునీరు, సాగునీరు, కోసం ఎదురుచూస్తున్న కీర్తిశేషులు పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు గత 20 సంవత్సరాల నుండి నిధులు కొరత తో నూతనడక నడుస్తుంది జరుగుతున్నటువంటి రాష్ట్ర బడ్జెట్లో వెలిగొండ ప్రాజెక్టుకు, మార్కాపురం జిల్లా కేంద్రానికి విధులు కేటాయించి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటు నారు నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చొరవ చూపి మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరుకుంటున్నాను. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలోని అన్ని పార్టీలు జేఏసీగా ఏర్పడి 38 రోజులు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగింది కనుక టిడిపి ప్రభుత్వం మార్కాపురం జిల్లాగా ప్రకటించి ఎన్నికల హామీని. నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాను అలా చేయని పక్షంలో ఈ ప్రాంత ప్రజలను పెద్ద ఎత్తున కదిలించి ఆందోళన చేయడానికి వెనుకాడమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## చదవడం మాకిష్టం కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 28)

ఉలవపాడు గ్రామ పరిధిలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత నీతి కథలు చదివించారు. క్యారంస్ ఆడించారు. నీతికథలు పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులకు మంచి భావనలు మనస్సులో పెరుగుతాయని, ఎంతో అర్థమయ్యేలా గ్రంథాలయ పాలకులైన కోటేశ్వరరావు, పిల్లలకు ఎంతో చక్కగా తెలియజేశారు.



# పాఠశాలలలో డిజిటల్ విద్యా సేవలు పెంపు పై పార్లమెంటులో మాగుంట ప్రశ్న



షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

దేశంలో ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విద్యా సేవలు పెంపుదల, గత ఐదేళ్లలో కవర్ కాబడిన, మౌలిక సదుపాయాల కల్పనకు గుర్తింపబడిన పాఠశాలలు, సేవల పెంపుకు ప్రచార, అవగాహన కార్యక్రమాల ఏర్పాటు గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి జయంత్ చౌదరి సమాధానమిస్తూ నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 ప్రకారం సాంకేతిక జోక్యాలవలన సాంకేతికతను నేర్చుకోవడం మరియు మూల్యాంకన ప్రక్రియ వృద్ధికావడం, భాషా అడ్డంకులు తొలగడం, ఉపాధ్యాయుల నైపుణ్యం- సమర్థత పెరగడం, దివ్యాంగుల విధ్యా ప్రవేశాలు పెరుగుదల, విధ్యా ప్రణాళిక - నిర్వహణ - పరిపాలన అమర్చుటకు, ప్రవేశాలు, హాజరు, అంచనా మొదలగు వాటిని మెరుగుపరచడం జరుగునని తెలిపారు. ఈ పాలసీ లక్ష్యాలు సాధించుటకు పి.యం. ఇ విద్య డిజిటల్, ఆన్ లైన్, ఆన్ ఎయిర్ ఎడ్యుకేషన్ కు సంబందించిన అన్ని ప్రయత్నాలను ఏకం చేస్తుందని, దిశా, డి.టి. హెచ్ టి.వి. ఛానల్, రేడియో, సి.బి.ఎస్.ఈ., శిక్షా వాణి, డైసీ, దీక్షా, సమగ్ర శిక్ష మొదలగు కీలక భాగాలను వినియోగించబడునని, దీంతో దేశం మొత్తంలో 25 కోట్ల మంది పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద గత 2021-22 నుంచి 2024-25 వరకు దేశం మొత్తంలో 44,025 లాబులు, 1,26,881 సమర్థవంత తరగది గదులు ఏర్పాటు కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2,687 ల్యాబులు, 5,190 సమర్థవంత తరగది గదులు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. డిజిటల్ ప్రారంభ కార్యక్రమాలను పలు ప్రింటు - సాంఘిక ప్రసార మాధ్యమాలు, జి -20 - ఎక్స్ పో సదస్సులు, సమావేశాలు, ప్రదర్శనలు, శిక్షణా కార్యక్రమాలు, సైన్సు ప్రదర్శనలు, టెక్నో మేళాలు, విద్యార్థి పరిషత్తులు, పుస్తక ప్రదర్శనల ద్వారా స్వయంప్రతిపత్తి సంస్థలు వృద్ధిచేస్తాయని కేంద్ర మంత్రి తెలిపారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మాణాలు ఆమోదం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)




యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఓ వీరారెడ్డి అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా కార్యాలయం ఒంగోలులో జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు సంఘ కార్యకలాపాలను సమీక్షిస్తూ నివేదికను ప్రవేశపెట్టారు. ముఖ్య అతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని, ముఖ్యంగా జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగించాలని, హైస్కూల్లో రెండు మీడియంలను సమాంతరంగా నడపాలని, మునిసిపల్ టీచర్స్ ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలని, మొదలగు డిమాండ్స్ తో జిల్లా కలెక్టర్ ,జిల్లా విద్యాశాఖ అధికారి, మండల తహసీల్దార్, ఎండిఓ,ఎంఈఓలకు అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందజేయాలి. ఇందుకోసం దశలవారీగా కార్యాచరణ రూపొందించామన్నారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఎమ్మెల్యేలకు విజ్ఞాపన పత్రాలు అందజేయడం, అదేవిధంగా వచ్చే నెల 20వ తేదీ నుంచి30వ తేదీ వరకు 3000 సంతకాలతో మంత్రులకు విజ్ఞాపన పత్రాలు, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పదో తేదీ వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్ట్ కార్డులు పంపించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ రవి, సహా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, సహా అధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి ,రాష్ట్ర కౌన్సిలర్స్, జిల్లా కార్యదర్శులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆడికృత్తిక ఆహ్వాన మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి, జులై 28)

ఈ నెల 30వ తేదీన ఈ క్షేత్రంలో ఆడికృతిక మహోత్సవం కనివిని ఎరుగని రీతిలో అత్యంత వైభవంగా జరుగుతుంది. భక్తులందరూ ఈ క్షేత్రానికి విచ్చేసి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి తరించాల్సిందిగా కోరారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ క్షేత్రంలో శ్రీ స్వామి వారు స్వయంభువుగా వెలిశారు. ఆడికృత్తిక అనగా శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం. దీనిని శ్రీ స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన పర్వదినంగా పరిగణిస్తారు. ఉదయం శ్రీ స్వామివారి స్వయంభువు మూర్తికి మాత్రమే పరిమిత సంఖ్యలో పాల అభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులు శ్రీ స్వామి వారిని ఉదయం 6 గంటల నుంచి దర్శనం చేసుకోవచ్చన్నారు. శ్రీ స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు శ్రీ స్వామివారి నూటొక్క స్తంభాల కళ్యాణ మండపంలో జరుగుతాయి. పై కార్యక్రమంలో పాల్గొనదలుచుకున్న భక్తులు దేవస్థానం వద్ద ముందుగానే వెయ్యి రూపాయలు టిక్కెట్ తీసుకుని, ఆడి కృతిక రోజు నాలుగు పూలమాలలు ఐదు రకాల పండ్లు , విడిపూలు తీసుకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లకు కొత్తగా నిర్మించబడిన కళ్యాణ మండపంలో శాంతి కల్యాణము అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూడా భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. భక్తులకు శ్రీ స్వామి అమ్మవార్లు ఆ రోజంతా చందన అలంకారంలో దర్శనమిస్తారన్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీ స్వామి వారి నిరంతర దివ్య ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు శ్రీ స్వామివారి వనంలో దాదాపు 3,000 మందికి అన్న ప్రసాద వినియోగము జరుగుతుందన్నారు. రాత్రి 10 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లకు అంగరంగ వైభవంగా వినోద కార్యక్రమాలతో బాణాసంచా వేడుకలతో, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. శ్రీ స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కావడిలు మోసుకొచ్చిన భక్తులు వారికి నిర్దేశించిన ప్రదేశంలో కూర్చోవాలి. వారికి శ్రీ స్వామివారి దర్శనాన్ని ప్రత్యేకంగా కల్పించి, శ్రీ స్వామివారి దివ్య ప్రసాదమును ప్రత్యేకంగా అందించబడుతుంది. దీనిని కావడిలు మోసుకొచ్చిన భక్తులు గుర్తించాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా విచ్చేసిన భక్తులకు శ్రీ స్వామివారి స్వయంభువు విగ్రహ దర్శనము కలగకపోవచ్చు. సదుద్దేశంతో అర్థం చేసుకోవాలని కోరారు. భక్తులు తలనీలాలను శ్రీ స్వామివారి వనములో ప్రత్యేకంగా నిర్మించిన శ్రీ స్వామి వారి కళ్యాణ కట్ట నందు సమర్పించవచ్చన్నారు. క్షేత్ర దర్శన వేళలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, సాయంత్రం 4నుంచి 9గంటల వరకు ఉంటుందన్నారు. భక్తుల సౌకర్యార్థం కోసం శ్రీ స్వామివారి జల ప్రసాద కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు ఆ జలాన్ని వృధా చేయరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు దేవస్థానము ముందు కాంక్రీట్ వేసిన భాగంలో పార్కింగ్ చేయాలన్నారు. కార్లు , మిగిలిన వాహనములు శ్రీ స్వామివారి వనం చుట్టూ, పుష్కరిణి వద్ద పార్కింగ్ చేయాలన్నారు. శ్రీ స్వామివారి వనములో భారీ ఎత్తున అన్నదానము జరుగుతున్నందువల్ల కార్లకు అక్కడ ప్రవేశం లేదన్నారు. భక్తులు తమ పాదరక్షలను ఆలయము వెలుపలే వదిలి రావలెనన్నారు. శ్రీ స్వామి వారి ఆలయంలోపల ఫోటోలు తీయడం నేరం అలా తీసినచో శిక్షార్హులు అన్నారు. భక్తులు సాంప్రదాయ వస్త్రాలను ధరించి మాత్రమే ఈ ఆలయంలోకి రావలెను. భక్తులు తమ కొబ్బరికాయలను ధ్వజస్తంభం వద్దే కొట్టుకోవాలన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

## పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 28)

పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే సహించేది లేదని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. ఆదివారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా 15వ వార్డులో మున్సిపల్ చైర్మన్ పర్యటించి అక్కడి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకోగా వార్డులోని చెత్త సేకరణ సరిగా జరగడం లేదని, అలాగే మురికి కాలువలు తీయడం లేదని తెలియజేయగా చైర్మన్ శానిటరీ కార్యదర్శిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. వార్డుల్లో పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వీడి మెరుగుపడాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలమయ్యే అవకాశం ఉందన్నారు. శానిటరీ సెక్రటరీలు, సిబ్బంది సమయపాలన పాటించని ఉద్యోగులపై కూడా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపలల్ శానిటరీ సిబ్బంది మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అండర్ 7 జిల్లా స్థాయి చెస్ క్రీడలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

స్థానిక సుజాత నగర్‌లోని ఐ కాన్ గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన అండర్ -7 జిల్లా స్థాయి క్రీడలలో బాలుర విభాగంలో మొదటి స్థానంలో విష్ణున్ష్ గుప్తా, రెండో స్థానంలో శ్రీరుదులు, బాలికల విభాగంలో ఏరిగల సుదీర్ఘ మొదటి స్థానంలో, చిడిపోతులు నిహీర రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చదరంగ సమాజ్య సెక్రటరి నబీ ఓ ప్రకటనలో తెలిపారు. ఐకాన్ గ్లోబల్ స్కూలు యాజమాన్యం గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

## మన్ కీ బాత్ - మనసులో మాట



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 28)

బెల్లంకొండ నగర్ ఆస్త ప్యాలస్‌లో భారత ప్రధాన మంత్రి ప్రతి నెల చివరి ఆదివారం ఆకాశవాణి ఉదయం 11నుంచి12గంటల వరకు నిర్వహించే మనసులో మాట (మన్ కీ బాత్) కార్యక్రమం దూరదర్శిన్ ద్వారా ప్రసారం చేయగా ఆదివారం(ఉదయం 11నుంచి 12 గంటల వరకు) జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ,పొదిలి మండలం బీజేపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసులు, మద్దుల లక్ష్మీకుమారీ, హజరత్ అలీ, ఎం.శ్రీనివాసులు, సాహితీ రాయల్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొని వీక్షించారు. మన్ కీ బాత్ (మనసులో మాట) కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని, మాదక ద్రవ్యాల కౌన్సిలింగ్ కేంద్రం " మానస్ " పేరుతో ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు, ఏక్ పేడ్ మాకే నామ్ - అమ్మ పేరు మీద ప్రతి పౌరుడు ఒక చెట్టు నాటి పోషించాలని, హర్ ఘర్ తిరంగా - స్వాతంత్య దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా (త్రివర్ణ పతాకం) ఎగురవేయాలని, అడవులను - వణ్య ప్రాణులను రక్షించడానికి జులై 29వ తేదీన జాతీయ పులుల దినోత్సవం నిర్వహించాలని దేశ ప్రజలను కోరారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్, ధనలక్ష్మీపురంలో ఆదివారం హెల్పింగ్ హాండ్స్ సొసైటీ కుంచాల విజయభాస్కర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా 15 సంవత్సరాలనుండి కుంచాల విజయభాస్కర్ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తదాన ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సేవా కార్యక్రమలలో నేటి యువత మరింత చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సుమారు 216 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పవన్ రెడ్డి, అల్తూరి మస్తానయ్య, వినయ్, సబిత , ఈశ్వరయ్య, శివ, మోపూరు భాస్కర్ నాయుడు, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ్ శ్రీను కలిసిన బిజెపి, జనసేన వరదయపాలెం నాయకులు



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 28)

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలం చెందిన బిజెపి, జనసేన నాయకులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ దంపతులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కూటమిలో గెలిచిన ప్రతి ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థులకు జనసేన, బిజెపి నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా యువ మోర్చ కార్యదర్శి, జనసేన రాష్ట్ర నాయకులు పసుపులేటి విజయకుమార్, ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీనివాసులు, జనసేన సీనియర్ నాయకులు, 10టీవీ శేఖర్, నాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

నెల్లూరు నగరంలోని ఏసీ నగర్‌లోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించారు. జీవితంలో ఏ కష్టమొచ్చినా మొదటి గుర్తొచ్చేది తల్లిదండ్రులే అని, స్వార్ధంతో నిండిన ప్రపంచంలో నిస్వార్ధ జీవులు తల్లిదండ్రులు మాత్రమే అనడంలో అతిశయోక్తి లేదేమో అని ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ అన్నారు. స్థానిక ఎసి నగర్ ఉన్న భాష్యం పాఠశాలలో జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం "తల్లిదండ్రుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు రకరకాల ఆటల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆటలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పిల్లల కోసం తల్లిదండ్రులు పడే కష్టం, చేసే త్యాగాలు, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు చేసే కృషిని గుర్తిస్తూ అందుకు గౌరవార్ధంగా ఈ పేరెంట్స్ డేని జరుపుకుంటారు అని అన్నారు. కనిపించే దేవుళ్ళు తల్లిదండ్రులని, వాళ్ళు మీ పై చూపే నిస్వార్ధ ప్రేమ పిల్లలను తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వారు చేసే కృషిని గుర్తించి వృద్ధాప్యంలో వారిని ఆదరించాలని విద్యార్ధులను సూచించారు. తల్లిదండ్రులను ప్రతి నిత్యం గుర్తుంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ప్రధానోపాధ్యాయురాలు, అస్మతాజ్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్ధులు పాల్గొన్నారు.




# ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ

## గుడ్ హెల్ప్ చైర్మన్ ప్రవీణ్ కుమార్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 28)

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ అని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంను పురస్కరించుకొని ఆదివారం కనిగిరి పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ వసతి గృహంలో ఉన్న విద్యార్ధులకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు జీవనం కొనసాగించాల్సింది ఈ భూమ్మీదేనని భూమి ఆరోగ్యమే వాళ్ల భవిష్యత్తుకు ఆధారమని అన్నారు. భూమిపై ఉండే నేల, నీరు, గాలి, ఖనిజాలు, అడవి, జంతువులు అన్నీ ప్రకృతి సంపదేనని వీటిలో ఏది నాశనం చేసినా భూమి మీద మనిషి మనుగడ ప్రశ్నార్ధకం అవుతుందని చెట్లు ఉంటే మనిషి మనుగడ ముందుకు సాగుతుందని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. జీవన శైలిలో మార్పుల వల్ల వాతావరణం మీద ప్రత్యక్షంగా ప్రభావం ఉంటుందని ప్లాస్టిక్ వాడకం మానేసి వాటికి బదులుగా బట్ట సంచుల్ని వాడాలని అన్నారు. విరివిగా మొక్కలు నాటాలని అవి మనకు ఆహారము,ఆక్సిజన్ అందిస్తాయని శక్తిని ఆదా చేసి కాలుష్యాన్ని నివారించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో సహాయపడతాయని అన్నారు. కార్యక్రమంలో మణికంఠ, ప్రిన్స్, విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ వైస్ ఉప కులపతి సుదర్శన్‌రావును కలసిన ఏపీ స్టూడెంట్స్ జేఏసీ



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 28)

2022 -26 సంవత్సరానికి సంబంధించిన జేఎన్టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు, బి ఫార్మసీ విద్యార్థులకు కరోనా సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. నేడు వారిని ఇంజనీరింగ్ మూడో సంవత్సరంలోకి ప్రమోషన్ లేకుండా డిటైన్ పేరుతో పేరుతో ఇబ్బంది పెట్టడం కరెక్ట్ కాదని, ఈ యొక్క సంవత్సరానికి ఆ బ్యాచ్‌కి సంబంధించిన విద్యార్థులను మినహాయింపు ఇచ్చి వారిని 3వ సంవత్సరంలోకి ఇయర్‌కు ప్రమోట్ చేయాల్సిందిగా ఏపీ స్టూడెంట్స్ జెఎసి ఆధ్వర్యంలో అనంతపురంలోని జేఎన్టీయూ వైస్ ఉపకులపతి సుదర్శన్ రావుని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ ఆధ్వర్యంలో కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా జెఎసి అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, ఉపాధ్యక్షులు ముక్తార్ భాషా, అనంతపురం జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గంగరాజు పాల్గొన్నారు.

# ఏపీ మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

ఆంధ్రప్రదేశ్ మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా అంబరపు వెంకటేశ్వర్లు, దుమ్న్ని విరోజీ, లక్ష్మీనారాయణ, ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా కాలే వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా అంబోరి వెంకట నాగేంద్ర బాబు, సెక్రటరీ సుబ్రమణ్యం, కోశాధికారిగా గంగారాం కర్నూల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అంబోరి కోటేశ్వరరావు, తిరుమలరావు, కాలే కృష్ణమోహన్, సోమ శివ కుమార్, కళ్యాణ్, కాలే సుబ్బారావు, తదితరులు హాజరయ్యారు.

# నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన ఎంపి మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 28)

వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనకు రోడ్ షో తయారు చేసేందుకు ఆదివారం ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక భవనంలో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం సందర్భంగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంతి నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. ఈ సమావేశంలో దేశంలో సంపూర్ణ పేదరికం నిర్మూలం కావాలంటే ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజాస్వామ్య భాగస్వామ్యం, నదుల అనుసంధానం, సంపన్నులు పేదవారిని దత్తత తీసుకోవడం, నదులు-అన్ని రవాణా మార్గాలు అనుసంధానం, గ్రామ స్థాయి మౌలిక వసతులు కల్పన, పరిశ్రమల స్థాపన, హరిత ఇంధనం, ప్రపంచస్థాయి ఉత్పత్తుల తయారీ, డెమోగ్రాఫిక్ మేనేజ్మెంటు తప్పక అవరసమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఎంతో గొప్పగా సూచినందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడుని, మాగుంట శ్రీనివాసులు రెడ్డి అభినందించారు.

# రైతులకు న్యాయం చేస్తాం

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర







(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 28)

భూ నిర్వాసితులను తెలుగుదేశం ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రైల్వే లైనుకు సంబంధించిన భూ సేకరణకు సంబంధించిన రైతులతో ఆర్‌డిఓ జాన్ ఇర్విన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైను గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు అత్యవసరంగా జరగాల్సి ఉందన్నారు. వీటివల్ల కనిగిరి ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అయితే వీటికి సంబంధించి భూములిచ్చే రైతులకు న్యాయం చేస్తామన్నారు. పనులు జరిగే రైల్వే లైను, గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిర్మాణానికి రైతులు ఆటంకం కల్గించవద్దన్నారు. నష్టపరిహారం చెల్లించడంలో రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే ఉగ్ర హామీ ఇచ్చారు.

**గోశాల ప్రారంభం :** పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. అనంతరం గోశాలను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గోశాల నిర్వహణకు ముందుకు వచ్చిన ఆలయ ధర్మకర్తను అభినందించారు. గోమాతను పూజించడం మన సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చావా సుబ్బయ్య, బోయళ్ళ నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# ముంగమూరు ఆదరణ కేంద్రంలో భోజనాలు, పండ్లు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, బోగోలు, జులై 28)

బోగోలు మండలం విశ్వనాధరావుపేట గ్రామపంచాయతీకి చెందిన వేణు ప్రీతి మనవరాలు ప్రియా పుట్టినరోజు సందర్భంగా భోజనాలు, పండ్లు పంపించారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్ యువసేన అధ్యక్షులు సమీవుల్ల పాల్గొని మాట్లాడుతూ వేణు కుటుంబ సభ్యులు గతంలో కూడా చాలాసార్లు ఆదరణ కేంద్రంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరిగింది. వారికి వారి కుటుంబ సభ్యులకి దేవుడు చల్లగా చూడాలని ఆశిస్తూ ఈ కార్యక్రమం పాల్గొన్న డైరెక్టర్ సింహాద్రికి, పుట్టినరోజు కార్యక్రమం జరుపుకుంటున్న రియా వారి తల్లిదండ్రులు స్మిత్ మౌనికాకు ధన్యవాదాలు తెలిపారు.

# వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒకటో వార్డు సభ్యురాలు



(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జులై 28)

సింగరాయకొండ మేజర్ పంచాయితీ పరిధిలోని ఒకటో వార్డు సభ్యురాలు పొట్లూరి సునీత ఆదివారం ఒకటో వార్డు సభ్యురాలు పొట్లూరి సునీత వైసీపీలో నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ సుందర్ నగర్ అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంలోనే జరిగిందని, పాఠశాల రద్దు చేస్తే తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పాఠశాలను ఏర్పాటు చేశామని, ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ సందానీ భాష, కూనపు రెడ్డి సుబ్బారావు, చీమకుర్తి కృష్ణ, ఇమ్మడిశెట్టి రామారావు, సుదర్సి ప్రసాదరావు, షేక్ సనావుల్లా, షేక్ యస్దాని, యాటగిరి మాలకొండయ్య, తదితరులు ఉన్నారు.

# నర్రవాడ వెంగమాంబ అమ్మవారి సేవలో ఎంపీటీసీ ఆకుపాటి మిత్రబృందం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 28)

నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నర్రవాడ వెంగమాంబ అమ్మవారి దేవస్థానంలో టీడీపీ యువ నాయకులు పామూరు పట్టణ ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ ఆకుపాటి వెంకటేష్ తన మిత్రబృందంతో కలిసి దేవస్థానం నందలి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల చేత ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో ఆకుపాటి వెంట వాకమల్ల జైపాల్, పుప్పాల రామ్మూర్తి, కటకం భాను, తాటిపర్తి మాల్యాద్రి, బండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఫుడ్స్ తీసుకుంటే వర్షాకాలంలో వచ్చే సమస్యలన్నీ దూరం






ఇమ్యూనిటీ తగ్గితే మనకి ఎన్నో సమస్యలొస్తాయి. వాటన్నింటికీ దూరంగా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. ముఖ్యంగా డైట్‌లో కొన్ని ఫుడ్స్ యాడ్ చేయాలి. దీంతో జలుబు, జ్వరం వంటి సమస్యలు దూరమవుతాయి. పెద్దలతో పాటు పిల్లలతో కూడా ఈ ఫుడ్స్ తినిపించాలి. ఎందుకంటే, ఈ టైమ్‌లో వారికి మరీ ఎక్కువ సమస్యలు వస్తాయి. మరి ఆ ఫుడ్స్ ఏంటో తెలుసుకోండి.

**నట్స్..**నట్స్‌లో ఎన్నో న్యూట్రియెంట్స్ ఉంటాయి. వీటిలో ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. నట్స్, గింజల్లో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. వీటిలో విటమిన్ ఆ, బి6, జింక్, కాపర్, సెలీనియంలో ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూన్ సిస్టమ్ బలంగా మారుతుంది.

**వర్షాకాలంలో ఇమ్యూనిటీని పెంచే ఫుడ్స్..??**


**పసుపు..**పసుపు తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను అందిస్తుంది. ఇందులో కర్క్యుమిన్ యాంటీ ఆక్సిడెంట్ గుణాలను పుష్కలంగా కలిగి ఉంటుంది. దీనిని బేబి ఫుడ్, వేడినీటిలో కలిపి తీసుకుంటే మంచిది.

**పెరుగు..**పెరుగు చాలా ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పెరుగులోని ప్రోబయోటిక్స్ అనే బ్యాక్టీరియా ప్రేగుల ఆరోగ్యాన్ని కాపడాతాయి. అంతేకాకుండా, ఇమ్యూనిటీని పెంచుతాయి. పెరుగుని రెగ్యులర్‌గా తీసుకుంటే జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీరాన్ని కాపాడుకోవడానికి పెరుగుని మాత్రమే తీసుకోవాలి. చక్కెర కలపకూడదు.

**అల్లం, తేనె..**ఇమ్యూనిటీని పెంచడంలో అల్లం, తేనె ముందుంటాయి. అల్లంలో పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పెంచుతాయి. అల్లం సహజ రోగనిరోధక బూస్టర్, యాంటీ మైక్రోబయల్ లక్షణాలు ఉంటాయి. ఈ అల్లాన్ని తేనెతో కలిపి తీసుకోవాలి. ఇందుకోసం అల్లం టీలో ఓ టీ స్పూన్ తేనె కలిపి తీసుకోవాలి.

**ఆకుకూరలు..**ఆకుకూరల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. దీనిని తినడానికి పెద్దగా ఇష్టపడరు. అలాంటప్పుడు వీటిని రోటీ, పరాఠా, సూప్స్‌లా చేసి తినిపించొచ్చు. పాలకూర, కాలే, బ్రకోలీ వంటి వాటిని తీసుకోవచ్చు.

# పల్లీలు, నువ్వులని ఇలా తీసుకుంటే వెన్నునొప్పి దూరమై జుట్టు పొడుగ్గా పెరుగుతుంది





వర్షాకాలంలో చాలా ఆరోగ్య సమస్యలొస్తాయి. వీటన్నింటిని దూరం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే ఆరోగ్య సమస్యలొస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని ఇంటి చిట్కాలు హెల్ప్ చేస్తాయి. అలాంటి ఇంటి చిట్కాల్లో ఓ పౌడర్ హెల్ప్ చేస్తుంది. మరి ఆ పౌడర్‌ని ఎలా తయారు చేయాలో తెలుసుకోండి.

**కావాల్సిన పదార్థాలు..**

- పల్లీలు
- నవారారైస్
- కొబ్బరి
- నువ్వులు
- బెల్లం?

**పొడవాటి జుట్టుకోసం ఆయిల్..??**

**నవారా రైస్..**

వీటినే రెడ్ రైస్ అంటారు. నవరా వరిలో ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. ఆయుర్వేదంలో వీటిని ఔషధంగా వాడతారు. ఇందులో కాల్షియం, విటమిన్ బి పుష్కలంగా ఉన్నాయి.



**బెల్లం..**చక్కెరతో పోలిస్తే బెల్లం హెల్దీ స్వీటెనర్. వర్షాకాలం, చలికాలంలో తీసుకోవడం వల్ల శరీరం వెచ్చగా ఉంటుంది. బెల్లంలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీంతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. పోషకాలు పుష్కలంగా ఉండడం వల్ల ఇమ్యూనిటీ పెరిగి ఇన్ఫెక్షన్స్‌తో పోరాడుతుంది. దీనిని తీసుకోవడం వల్ల త్వరగా జీర్ణమవుతుంది. దీనిని తిన్న వెంటనే శక్తి లభిస్తుంది.

**నువ్వులు..**నువ్వుల్లో ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. నువ్వుల్లో ఒమేగా 6, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, విటమిన్స్ బి, ఇ లు ఉన్నాయి. వీటితో పాటు కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలని బలంగా చేస్తుంది. కాబట్టి, వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు దూరమవుతాయి. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా మంచిది. ఆర్థరైటిస్ వంటి సమస్యలు దూరమవుతాయి. ఇందులో కాల్షియం, జింక్, కాపర్ పుష్కలంగా ఉన్నాయి. దీని వల్ల రుమాటిజం వంటి సమస్యలు దూరమవుతాయి. మెనోపాజ్ తర్వాత ఎముకలు అరిగిపోవడం వంటి సమస్యలు వస్తాయి. వీటిని దూరం చేసేందుకు నువ్వులు మంచివి.

**పల్లీలు..**పల్లీల్లో ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ పల్లీల్లో మోనో పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలని అందిస్తాయి. ఇందులో విటమిన్స్ ఇ, బి1, బి3, బి9, మెగ్నీషియం, ఫాస్పరస్, కాపర్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రెస్వెరాట్రాల్, ఫినోలిక్ ఆమ్లాలు, ఫ్లేవనాయిడ్స్, అర్జినైన్, ఫైటోస్టెరాల్స్ వంటి పోషకాలు ఉన్నాయి.

**ఎలా తయారు చేయాలి..**ముందుగా బియ్యాన్ని వేయించాలి. నువ్వులని వేయించాలి. వీటన్నింటిని మిక్సీ జార్‌లో వేయాలి. ఇందులో తీపి కోసం బెల్లం, కొబ్బరి కూడా వేసి పొడిలా చేయాలి. దీనిని రోజుకి ఓ స్పూన్ పరిమాణంలో తీసుకుంటే వర్షాకాలం, చలికాలంలో వచ్చేసమస్యల్ని దూరం చేసుకోవచ్చు. మరీ ముఖ్యంగా, ఈ సమయంలో వచ్చే వెన్నునొప్పి వలంటి సమస్యల్ని దూరం చేసుకోవడంతో పాటు జుట్టు రాలే సమస్యల్ని కూడా తగ్గించుకోవచ్చు.

# కరివేపాకుని ఇలా తింటే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది..



కరివేపాకు.. దీనిని తినడం వల్ల హెల్త్ బెనిఫిట్స్ నుంచి బ్యూటీ బెనిఫిట్స్ వరకూ ఎన్నో లాభాలున్నాయి. వీటిని తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరిగి ఐరన్ లోపం తగ్గుతుంది. ఇందులో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. దీనిని ఆహారంలో తీసుకుంటే చాలా లాభాలున్నాయి. పచ్చి కరివేపాకుని నమిలితే చాలా లాభాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.

**ఎముకల బలానికి..**కరివేపాకులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది దంతాలు, ఎలుకల ఆరోగ్యానికి మంచివి. వీటిని తినడం వల్ల కీళ్ళనొప్పులు, షుగర్ ఉన్నవారిలో ఎముకలని నొప్పిని తగ్గించి ఎముకల్ని బలంగా మారుస్తుంది.

**చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించే టిప్స్..??**

**కిడ్నీలకు మందుగా..**



కరివేపాకులో ఫాస్పరస్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి, దీనిని తీసుకోవడం వల్ల డీటాక్సీఫైయర్‌లా పనిచేస్తుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడపున కరివేపాకుని తింటే మూత్రపిండాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు పూర్తిగా తొలిగి వాటి పనితీరు మెరుగవుతుంది.

**ఇమ్యూనిటీ..**రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఓ గ్రాము పచ్చి కరివేపాకు తింటే ఇమ్యూనిటీ పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కరివేపాకులో ప్రోటీన్స్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. దీని వల్ల ఇమ్యూనిటీ బలంగా మారతుంది. ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి.

**కొలెస్ట్రాల్‌ని తగ్గించడం..**కరివేపాకు తింటే  అనే చెడు కొలెస్ట్రరాల్ తగ్గుతుంది. దీంతో రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోదు. చెడు కొలెస్ట్రాల్ తగ్గితే బీపి కూడా కంట్రోల్ అవుతుంది. దీంతో గుండె సంబంధ సమస్యలు తగ్గి హార్ట్ హెల్త్ బాగుంటుంది.

**మలబద్ధకానికి మందుగా..**కరివేపాకులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. దీంతో మలబద్ధకం సమస్య దూరమవుతుంది. కొందరికీ అజీర్ణం కారణంగా విరోచనాలు అవుతాయి. కరివేపాకుని పచ్చిగా తింటే ఈ సమస్య దూరమవుతుంది. అయితే, ఎక్కువగా తింటే మాత్రం డయేరియా వస్తుంది.

**జుట్టు బలానికి..**జుట్టు రాలడానికి కారణం కుదుళ్ళు ఆరోగ్యంగా లేకపోవడమే.. ఇందుకు ప్రోటీన్ లోపం, ఐరన్ లోపం. ఈ రెండు లోపాల కారణంగా జుట్టు రాలుతుంది. అయితే, కరివేపాకు తింటే ఈ సమస్యలు దూరమవుతాయి. కరివేపాకులో విటమిన్ బి12, విటమిన్ ఇ జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

# బాదంపప్పుని ఎందుకు నానబెట్టి తినాలంటే..

బాదంలో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇందులో హెల్దీ ఫ్యాట్స్, ప్రోటీన్స్, విటమిన్స్, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. రోజూ బాదం తింటే చాలా లాభాలున్నాయి. బాదం తింటే బాడీలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. హెల్దీ వెయిట్‌తో పాటు ఎముకలు బలంగా మారతాయి. బ్రెయిన్ ఆరోగ్యంగా ఉంటుంది. అందుకోసం బాదంని ఎలా తినాలో తెలుసుకోవడం మంచిది.



**వేయించిన బాదం..**కాల్చిన బాదం చాలా రుచికరంగా ఉంటుంది. ఇది స్నాక్స్‌లా తినొచ్చు. అయితే, ఎలా వేయించాలనేది తెలిసి ఉండాలి. బాదంపప్పుని డ్రై రోస్ట్ చేయొచ్చు. ఉప్పుతో వేయాలి. దీనిని ఎవరైనా తినొచ్చు.

**షుగర్ పేషెంట్స్‌కి ఈ 5 బెస్ట్ నట్స్..??**

**ప్రాసెస్డ్ చేయని..**

పచ్చి బాదంని ప్రాసెస్ చేయని బాదం అంటారు. వీటిని తినడం వల్ల మీకు విటమిన్ ఈ, మెగ్నీషియం, హెల్దీ ఫ్యాట్స్, మోనోశాచురేటెడ్ కొవ్వు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందుతాయి. ఈ బాదంపప్పులు తింటే గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. అదే విధంగా, చెడు కొలెస్ట్రాల్ కరుగుతుంది. ఎలాంటి సమస్యలు లేని వారు రోజుకి 5 నుంచి 10 బాదంపప్పులు తినొచ్చు. దీనికోసం గాలి చొరబడని గాజు కంటెయినర్‌లో వీటిని పెట్టండి.

**నానబెట్టడం..**బాదంపప్పుని రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే చాలా మంది తింటారు. ఇది హెల్దీ అని చెబుతారు. రాత్రంతా నానబెట్టడం వల్ల పొట్టు ఈజీగా వస్తుంది. త్వరగా జీర్ణమవుతుంది. పోషకాలని త్వరగా గ్రహించగలుగుతాం. అయితే, చర్మంలోని ఎంజైమ్ ఇనిబిటర్స్ పోషకాల శోషణకి ఆటంకం కలిగిస్తాయి. కాబట్టి, నానబెట్టిన తర్వాత పొట్టుని తొలగించి తినొచ్చు. అంతేకాదు, నానబెడితే ఫైటిక్ యాసిడ్ పరిమాణం తగ్గుతుంది. ఇది ఎంజైమ్ ఇనిబిటర్, ఇది పోషకాల శోషణని మెరుగ్గా చేస్తుంది. నానబెట్టిన బాదంని నమిలి తినడం మంచిది. ఇది పిల్లలకి చాలా మంచిది.

**బాదం బటర్..**పీనట్ బటర్‌లా.. ఆల్మండ్ బటర్ కూడా చాలా మంచిది. దీనిని ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్‌లో చేర్చితే హెల్దీ ఫ్యాట్స్, ఫైబర్, పోషకాలు అందుతాయి. ఆల్మండ్ బటర్‌లో మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇది ఎక్కువసేపు మీకు కడుపు నిండిన ఫీలింగ్,ని కలిగిస్తాయి. జీర్ణ ఆరోగ్యానికి హెల్ప్ చేస్తాయి. అయితే, ఇందులో చక్కెర, హైడ్రోజనేటెడ్ ఆయిల్స్ లేకుండా తీసుకోవడం మంచిది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com